ప్రీతిది ఆత్మహత్యే..

- ఫోరెన్సిక్, పోస్టుమార్టం నివేదికలో వెల్లడి
- వరంగల్ సిపి ఎవి రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిజి వైద్య విద్యార్థిని ప్రీతిది ఆత్మహత్యేనని, ఈ మేరకు ఫోరెన్సిక్, పోస్టుమార్టం నివేదికల్లో స్పష్టంగా ఉందని వరంగల్ పోలీసు కమిషనర్ ఎవి రంగనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ కమిషనరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రీతి ఆత్మహత్యపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సవివరణ ఇచ్చారు. వారం, పది రోజుల్లో ఛార్జ్ షీట్ దాఖలు చేయనున్నట్టు తెలిపారు. సైఫ్ వేధింపుల వల్లే ప్రీతి ఆత్మహత్య చేసుకుందన్నారు. పాయిజన్ ఇంజక్షన్ తీసుకోవడం వల్లే చనిపోయిందని తెలిపారు. ప్రీతి కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం విదితమే. ఇటీవలే ప్రధాన నిందితుడైన సైఫ్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

పేపర్ లీకులో బండి సంజయ్ ప్రమేయం ఉంది

- హైకోర్టుకు తెలిపిన ఎజి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రమేయం ఉందని అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ హైకోర్టుకు తెలిపారు. తనపై నమోదైన పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ కేసు కొట్టివేయాలని బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై హైకోర్టు సిజె జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజకీయ దురుద్దేశాలతో కావాలనే తనపై ఈ కేసు పెట్టారని సంజయ్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అర్ధరాత్రి అరెస్టు చేసి 150 కి.మీ తీసుకెళ్లారని తెలిపారు. మరోవైపు ఈ కేసులో బండి సంజయ్ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలున్నాయని, దర్యాప్తులో కీలకమైన మొబైల్‌ను ఇవ్వట్లేదని ఎజి చెప్పారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి మార్చి 1 నుంచే కుట్ర జరిగిందని ఎజి న్యాయస్థానానికి వెల్లడించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం.. హుందాగా వ్యవహరించాలని వ్యాఖ్యానించింది. గుజరాత్ సహా దేశవ్యాప్తంగా ప్రశ్నపత్రాలు ఎందుకు లీకవుతున్నాయని ప్రశ్నించింది. గతంలో ఒకట్రెండు రాష్ట్రాల్లోనే ఈ తరహా ఘటనలు జరిగేవని వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలన్న సంజయ్ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. సంజయ్ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి, హెడ్‌మాస్టర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 16కు వాయిదా వేసింది.

సిఎం కప్ టోర్నీకి ఏర్పాట్లు

- క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే నెల 15 నుంచి 31 వరకు సిఎం కప్ పేరిట క్రీడలను అన్ని జిల్లాల్లో నిర్వహించాలని క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి ఎండి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. జూన్2న విజేతలకు బహుమతులు అందజేయనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను పూర్తి చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని బిఆర్ భవన్‌లో క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్లు, స్టేడియాల అడ్మినిస్ట్రేటర్లు, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర క్రీడా కారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు వీలుగా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తేవడానికి సిఎం కప్ క్రీడలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. టోర్నీలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, కోకో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించాలని జిల్లా స్థాయిలో వీటితో పాటుగా హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడలు నిర్వహించాలని సూచించారు.

మోసం చేస్తే ఊరుకునేది లేదు

- ఇందిరమ్మ మూడవ విడత లబ్ధిదారుల సమస్యను సిఎం దృష్టికి తీసుకెళతాం
- జనగామలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సభలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ మూడో విడత ఇళ్ల స్థలాల లబ్ధిదారులను మోసం చేస్తే ఊరుకునేది లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. జనగామ జిల్లా బాణాపురంలోని మూడవ విడత ఇందిరమ్మ ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద చేస్తున్న ఆందోళనకు శుక్రవారం తమ్మినేని వీరభద్రం సంఘీభావం తెలిపారు. సిపిఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ మొత్తం కాలినడకన తిరిగి సందర్శించడం, లబ్ధిదారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. 2012 - 13 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం షామీర్‌పేట శివారు ప్రస్తుతం జనగామ పట్టణంలో 1144 మందికి పట్టాలిచ్చారని, ప్రస్తుతం వారిని సర్వేల పేరుతో మోసం చేసే కుట్ర జరుగుతోందని అన్నారు. పేదల సమస్యలను, త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. పేద లబ్ధిదారులకు సిపిఎం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు 2018 సంవత్సరం నుంచి మూడవ విడత ఇందిరమ్మ లబ్ధిదారులతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు ప్రవర్తించడంతో పార్టీ నాయకత్వం లబ్ధిదారులకు అండగా నిలబడి పోరాటం చేస్తోందని తెలిపారు. లబ్ధిదారుల విషయంలో హైకోర్టులో కేసు వేశారని, హైకోర్టులోనూ లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలని చెప్పిందన్నారు. కానీ ప్రభుత్వ అధికారులు సర్వేల పేరుతో ఇళ్ల స్థలాల లబ్ధిదారులను మోసం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. పట్టాలు ఉన్న వారికి కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. ఒకరి పట్టా తీసుకొని ఇంకొకరికి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. అ విషయంలో వారికి న్యాయం జరగకుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాగా, ఈ వారంలో సిఎంని కలిసే అవకాశం ఉందని, ఈ విషయాన్ని తప్పనిసరిగా ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేటట్టుగా కృషి చేస్తామన్నారు. బిఆర్‌ఎస్‌తో స్నేహం రాజకీయంగా బిజెపితో వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రాతిపదికమీదే ఉందన్నారు. ఎన్నికల్లో స్నేహం ఉండే అవకాశం ఉన్నా సమస్యలపై పోరాటం పోరాటంగానే ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, బోట్ల శేఖర్, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజేందర్, బోడ నరేందర్, పి ఉపేందర్, బి చందు నాయక్, ఆఫీస్ ఇన్‌చార్జి బిట్ల గణేష్, మూడవ విడత లబ్ధిదారుల సంఘం అధ్యక్షులు కళ్యాణం లింగం, పట్టణ కమిటీ బాల్నే వెంకటమల్లయ్య, పందిళ్ల కల్యాణి పల్లెర్ల లలిత, చిర్ర రజిత, పల్లెర్ల శంకర్, విష్ణు, ఏ. సురేష్, వినోద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డిసెట్ నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 1న రాతపరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఐఇడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్‌ఇ) కోర్సుల్లో 2023-25 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2023 నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు వచ్చేనెల 22వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు అదేనెల 27 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని వివరించారు. జూన్ ఒకటో తేదీన డీసెట్ రాతపరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. అదేనెల ఎనిమిదో తేదీన ఫలితాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. జూన్ 12వ తేదీ నుంచి ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. జులై ఐదో తేదీ వరకు ఇది కొనసాగుతుందని వివరించారు. ధ్రువపత్రాల పరిశీలన, వెబ్‌ఆప్షన్ల నమోదు, సీట్ల కేటాయింపు, కాలేజీల్లో ఫీజు చెల్లింపు ఉంటుందని పేర్కొన్నారు. జులై 12వ తేదీన నిబంధనలు విడుదల చేస్తామని తెలిపారు. డైట్, ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ప్రయివేటు విద్యాసంస్థలతోపాటు మైనార్టీ, మైనార్టీయేతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు చేపడతామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

లౌకికవాదాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం

- రంజాన్ శుభాకాంక్షల సందేశంలో సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంగా జమునా సంస్కృతికి తెలంగాణ నేల ఆలవాలమని సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో లౌకికవాదాన్ని, మత సామరస్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ సిఎం ఈ మేరకు సందేశాన్ని విడుదల చేశారు. ఉపవాస దీక్షల ద్వారా పరిఢవిల్లిన క్రమశిక్షణ, సహోదరత్వం, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన స్ఫూర్తితో 'ఈద్ ఉల్ ఫితర్...' పర్వదిన వేడుకలను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.13 వేల కోట్లను కేటాయించి ఖర్చు చేస్తున్నదని వివరించారు. వారి కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలు, ప్రగతి కార్యాచరణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న ముస్లిం మైనారిటీ అభివృద్ధి మోడల్‌ను దేశవ్యాప్తంగా విస్తరింపజేసేందుకు తమ కృషి కొనసాగుతూనే ఉంటుందని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నోటీసులకు భయపడేది లేదు

- నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్పత్రి యాజమాన్యం నోటీసులకు భయపడేది లేదని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఎం వెంకటేష్ అన్నారు. పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో 1200 మంది కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న "వన్ అవర్ డెమోనిస్ట్రేషన్" కార్యక్రమం శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడారు. నిమ్స్ యాజమాన్యం గతంలో కార్మికులకు చేసిన వాగ్దానం ప్రకారం వేతనాన్ని రూ.21000 కు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. తాము చేస్తున్న పోరాటాన్ని అణచి వేయడానికి బెదిరింపులకు పాల్పడుతున్నదన్నారు.

నిమ్స్ హాస్పటల్ ఎస్మా పరిధిలో ఉందని చెప్పి నోటీసులు ఇప్పించి కార్మికులను భయభ్రాంతులకు గురి చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నిమ్స్ యాజమాన్య తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. సమస్యను జటిలం చేయకుండా సామరస్య పూర్వకంగా పరిష్కారించాలని కోరారు. నిమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, రిటైరైన కార్మికులకు ఉచితంగా వైద్యం చేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, మెట్రో బస్‌పాస్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతనాల జిఒ 73 వెంటనే సవరించి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని కోరారు. ఈ మధ్యకాలంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ప్రభుత్వం జిఒలు సవరించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహ, నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కారించాలని లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆందోళన చేస్తున్న నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్

పేపర్ లీకు కేసులో తండ్రి కొడుకు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో మరో ఇద్దరు అరెస్టయ్యారు. కేసుకు సంబంధించి మహబూబ్‌నగర్‌కు చెందిన మైబయ్య, ఆయన కుమారుడు జనార్ధన్‌ను సిట్ శుక్రవారం అరెస్ట్ చేసింది. జనార్ధన్ కోసం డాక్యానాయక్‌కు రూ.రెండు లక్షలు ఇచ్చి మైబయ్య ఎఇ పేపర్ కొన్నట్లు సిట్ అధికారులు దర్యాప్తులో తేల్చారు. వికారాబాద్ ఎంపిడిఒ కార్యాలయంలో మైబయ్య టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో డాక్యా నాయక్‌తో ఆయనకు పరిచయం ఏర్పడింది. ఎఇ ప్రశ్నపత్రానికి రూ. ఆరు లక్షలు ఇవ్వాలని మైబయ్యను డాక్యా కోరాడు. అయితే రూ. రెండు లక్షలు మాత్రమే ఇస్తానని మైబయ్య చెబుతూ.. ఆ డబ్బును డాక్యా నాయక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఎఇ ప్రశ్నపత్రాన్ని మైబయ్యకు డాక్యా అందజేశాడు. దాన్ని మైబయ్య తన కుమారుడు జనార్ధన్‌కి ఇచ్చి పరీక్ష రాయించాడు.

తెలంగాణ పథకాలను కేంద్రం కాపీ కొడుతోంది

- గజ్వేల్, రాష్ట్ర అభివృద్ధి దేశానికి దిక్సూచి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొడుతోందని ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లో శుక్రవారం నిర్వహించిన బిఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. గజ్వేల్‌తో పాటు రాష్ట్ర అభివృద్ధి దేశానికే దిక్సూచిగా మారనుందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి గజమాల లాంటిదన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే బిఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని తెలిపారు. 70 ఏళ్లలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు పరిపాలించిన రోజుల్లో గజ్వేల్ నియోజకవర్గం ఎలా ఉండేదో, ఈ ఏడేళ్లలో ఎన్ని మార్పులు జరిగాయో ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరిగితే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వార్తలు రాసేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారి, వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన వారు తెలంగాణతో పాటు గజ్వేల్ అభివృద్ధిని చూసి కితాబిస్తున్నారన్నారు. గతంలో గణేష్ నిమజ్జనాలు, బతుకమ్మ పండుగలు ఎక్కడ నిమజ్జనం చేయాలోనని ప్రజలు అయోమయానికి గురయ్యేవారని, కానీ ప్రస్తుతం మిషన్ కాకతీయ ద్వారా అనేక చెరువులు, కుంటలను అభివృద్ధి చేశామని, పుష్కలంగా నీళ్లు ఉన్నాయని వాటిల్లో నిమజ్జనం చేస్తున్నారన్నారు. గజ్వేల్‌కు ముఖ్యమంత్రి కెసిఆర్ వచ్చాక రింగు రోడ్డు, పార్కులు, రైల్వేస్టేషన్, డ్యాములు తెచ్చారన్నారు. గతంలో గజ్వేల్‌లో యాసంగిలో 7 వేల ఎకరాలు సాగు చేసేవారని, ప్రస్తుతం 17 వేల ఎకరాలను సాగు చేస్తున్నారని తెలిపారు. గులాబీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గులాం గిరి చేస్తుంది తప్ప, ఢిల్లీ పెద్దలకు కాదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, మెదక్ జిల్లా పరిషత్ చైర్మెన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మెన్ కృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మానవ వనరుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జకీర్, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సబితకు వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

- రెగ్యులర్ లెక్చరర్ల బదిలీలు చేపట్టాలి
- మంత్రులు హరీశ్‌రావు, సబితకు టిప్స్, టిఎస్‌జిసిసిఎల్‌ఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టిఎస్‌జిసిసిఎల్‌ఎ-475) డిమాండ్ చేశాయి. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, రెగ్యులర్ లెక్చరర్ల బదిలీలు చేపట్టాలని కోరాయి. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డితోపాటు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో టిప్స్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, సమన్వయకర్త మైలారం జంగయ్య, టిఎస్‌జిసిసిఎల్‌ఎ అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియ గురించి సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా ఉత్తర్వులు వచ్చేటట్టు చూడాలని కోరారు. అదేవిధంగా గత ఐదేళ్లగా రెగ్యులర్ అధ్యాపకులు, ప్రిన్సిపళ్ల బదిలీల్లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బదిలీలు జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ అంశాల పట్ల మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిఎం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌జిసిసిఎల్‌ఎ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, సైదులు, ముడి శేఖర్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ బృందంతో 23న అమిత్ షా తేనీటి విందు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 23న ఆదివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో ఆయన శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ఆస్కార్ విజేతలతో తేనీటి విందులో పాల్గొననున్నారు. 5.15కి అక్కడి నుంచి బయల్దేరి రోడ్డు మార్గం ద్వారా చేవెళ్లకు వెళ్లనున్నారు. 6గంటలకు హైదరాబాద్ శివారులోని చేవెళ్ల చేరుకొని.. పార్లమెంటరీ ప్రవాస్ యోజన సమావేశంలో అమిత్ షా పాల్గొననున్నారు. అమిత్‌షా కర్ణాటకలో ఎన్నికల ప్రచారం ముగించుకున్న అనంతరం ఇక్కడికి రానున్నారు. చేవెళ్లలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. తెలంగాణ శాసనసభ ఎన్నికలు ఈ ఏడాదే జరగనున్న నేపథ్యంలో ముఖ్య నేతలు తరచూ రాష్ట్రంలో పర్యటించడంతో పాటు ఇకపై ప్రతినెలా ప్రధాని, హోంమంత్రి పర్యటిస్తారని బిజెపి నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అమిత్‌షా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులు పార్టీలో చేరేలా రాష్ట్ర ముఖ్య నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అమిత్‌షా సభలోపు ఈ అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

అసైన్డ్ భూములను ధరణిలో నమోదు చేయాలి

- కొండాపూర్ మండలంలో రైతుల ఆందోళన
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు అసైన్డ్ చేయబడిన భూములను ధరణి వెబ్‌సైట్‌లో చేర్చి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిర్వహిస్తున్న ఆందోళనలో సాగర్ పాల్గొని మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో మహ్మదాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 22లో 188 మంది పేదలకు 32 ఎకరాల భూమిని పేదలకు అసైన్డ్ చేశారని తెలిపారు. రైతులకు పట్టాలు పంపిణీ చేసి పాసుపుస్తకాలనూ జారీ చేయబడ్డాయని తెలిపారు. కాగా, ఆ భూముల వివరాల్లో రైతుల పేర్లు ధరణి పోర్టల్‌లో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. అసైన్డ్ చేసినప్పటి నుంచి రైతులు భూమిని సాగు చేసుకుంటూ కబ్జాలో ఉన్నారని తెలిపారు. 12 ఏండ్లుగా భూమిని నమ్ముకుని సాగు చేసుకుంటున్న రైతుల పేర్లను ధరణిలో చేర్చకుండా అన్యాయం చేయడం సరైంది కాదన్నారు. పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు లేని కారణంగా రైతు బంధు, రైతు బీమా, పంట రుణాలు, పంట నష్టం, ఇతర రాయితీలేవీ అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడిగా భూమిని నమ్ముకుని సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె రాజయ్య, ఉపాధ్యక్షులు బి యాదవరెడ్డి, నాయకులు అమృతమ్మ, సుశీల, చంద్రమ్మ, మనెమ్మ, యాదయ్య, రాములు, కమలమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- కొనసాగుతున్న ఐకెపి విఒఎల సమ్మె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో విఒఎల నిరవధిక సమ్మెకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మద్దతు తెలిపారు.

విఒఎలను సెర్ఫ్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పిసిసి కార్యవర్గ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో విఒఎలు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి పిసిసి కార్యవర్గ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. వీవోఏలకు పనికి తగ్గ వేతనం కల్పించాలని తలకొండపల్లి జడ్‌పిటిసి ఉప్పల వెంకటేష్, ఎంపిపి నిర్మల శ్రీశైలగౌడ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఎదుట ఐదోవ రోజు కొనసాగుతున్న వివఒల దీక్షకు మద్దతు ప్రకటించారు. చిట్యాల పట్టణ కేంద్రంలో విఒఎల సమ్మెకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విఒఎ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మర్రిగూడ మండల కేంద్రంలో, దామరచర్లలో ఐకెపి, విఒఎలు నిరవధిక సమ్మెలో భాగంగా చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. నాంపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఐకెపి, విఒఎల సమ్మెకు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వాసిపాక ముత్తిలింగం మద్దతు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A. 655/2022 in O.S.1571/2016

Between:
Smt. Vempada (Atchi) Vani & another ...Petitioners
And:
M/s. Kalyani Constructions, Rep. by its Managing Partner Sri Vankayalapati Murali Krishna & 9 others ...Respondents

NOTICE

To,
R-1 : M/s. Kalyani Constructions, D.No.8-2-293/175/A/16, D.N. Reddy Colony, Road No.14, Banjara Hills, Hyderabad, Rep. by its Managing Partner Sri Vankayalapati Murali Krishna, S/o. late Veera Raghavayya, D.No.8-2-293/175/A/16, D.N. Reddy Colony, Road No.14, Banjara Hills, Hyderabad,
R-8 : Kum. Vempada Sarada @ Lakshmi, D/o. late Thata, D.No.34-10-16/1, Dayananda Veedhi, Gnanapuram, Visakhapatnam.
R-9 : Smt. Ginni Suseela, W/o. Nooka Raju, D.No.46-11-1, Alluvari Veedhi, Akkayyapalem, Visakhapatnam District.

Whereas the above named petitioners is filed the above I.A.655/2022 for set aside the dismissal order dated 05-07-2022. The same stands posted to **28-06-2023** for notice to you all. You are hereby called upon to appear on **28-06-2023** at **10:30 A.M.** before the above Court either in person or by a pleader to answer the above suit or else the matter will be disposed of in your absence according to law.

(By Order of the Hon'ble Court)
K. PRABHAVATHI, Advocate
Visakhapatnam-17, Cell: 9440435309

ఘనంగా శ్రీకృష్ణ జ్యువెలర్స్ 10వ వార్షికోత్సవం

హైదరాబాద్ : శ్రీకృష్ణ జ్యువెలర్స్ తన బంజారాహిల్స్ స్టోర్ 10వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వేడుకగా ప్రారంభించింది. ఏప్రిల్ 22 నుంచి మే 01 వరకూ పది రోజుల పాటు అతిపెద్ద వెడ్డింగ్ కార్నివాల్‌ను నిర్వహించన్నట్లు పేర్కొంది. ప్రముఖ సోషల్ క్యూరేటర్ల నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కేవలం బ్రైడల్ జ్యువెలరీ ప్రదర్శించడం మాత్రమే కాదు అంతకు మించి ఉంటుందని తెలిపింది. ఈ సందర్భంగా క్యారట్ డైమాండ్‌పై రూ.56,000 స్పెషల్ ఆఫర్ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అర్చితా అగర్వాల్ తెలిపారు.

ఇరస్వ ఫైన్ జ్యువెలరీ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ఆభరణాల బ్రాండ్ ఇరస్వ ఫైన్ జ్యువెలరీ తన నూతన స్టోర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ సంస్థ ముంబయి, అహ్మదాబాద్‌లో స్టోర్లను కలిగి ఉంది. తన రిటైల్ ఉనికిని విస్తరించుకునే క్రమంలో బంజారాహిల్స్‌లో కొత్త అవుట్‌లెట్‌ను తెరిచినట్లు పేర్కొంది. వినియోగదారుల వ్యక్తిగత ఆకాంక్షలు నెరవేరేలా అభరణాలు లభిస్తాయని ఇరస్వ సిఇఒ కేతన్ పటేల్ తెలిపారు. వినియోగదారులు ఒక్క సారి ఇరస్వ అభరణాన్ని కొనుగోలు చేస్తే.. వారు తమ కుటుంబంలో శాశ్వతంగా భాగమవుతారన్నారు.

మాట తప్పిన కెసిఆర్

వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమను కొంటామంటూ బిల్డప్‌ల మీద బిల్డప్‌లిచ్చిన సిఎం కెసిఆర్ ఇప్పుడు ఆ అంశం నుంచి వెనక్కి తగ్గడమేంటని వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆయన తీరుతో రాష్ట్ర పరువు పోయిందని తెలిపారు. గతంలో హామీ ఇచ్చినట్టుగా బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూతపడ్డ వందలాది పరిశ్రమలను తెరిపించాలని పేర్కొన్నారు.లక్షలాది మంది కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఒయులో ఇండో- పసిఫిక్ అధ్యయన కేంద్రం

- తీర ప్రాంత దేశాలతో సత్సంబంధాలు అవసరం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్
- యుద్ధాలు సమస్యలు పరిష్కరించలేవు..
- కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఒఎస్‌టి, అంబాసిడర్ రాజశేఖర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఒయు కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా ఇండో ఫసిఫిక్ అధ్యయన కేంద్రం చేరింది. సామాజిక శాస్త్రాలు మొదలు.. శాస్త్ర సాంకేతిక రంగాలు, విదేశీ భాషల వరకు విద్యా బోధనలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని" రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రపంచ స్థాయి సామాజిక, ఆర్థిక, సమకాలీన స్థితిగతులపై అధ్యయనం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఇండో-పసిఫిక్ అధ్యయన కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విస్తారమైన ఇండియన్ - పసిఫిక్ మహా సముద్ర తీర దేశాల మధ్య సత్సంబంధాలపై విస్తృత అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత సమజంలో సేల్స్ మెన్ నుంచి అంబాసిడర్ దాకా అంతర్జాతీయ వ్యవహారాలపై కనీస అవగాహన తప్పనిసరిగా మారిందని వ్యాఖ్యానించారు. ఇండో పసిఫిక్ తీర ప్రాంత దేశాలతో సత్సంబంధాలు, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక మైత్రి అవసరమని, అప్పుడే అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించొచ్చని తెలిపారు. త్వరలోనే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచ వ్యూహాత్మక కేంద్రంగా మారనుందన్నారు. తూర్పు, పశ్చిమ దేశాలకు మధ్య వారధి అవుతుందని వివరించారు. అందుకే లోతైన, నాణ్యమైన పరిశోధనల ద్వారా ఇండో పసిఫిక్ సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చన్నారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ తర్వాత ఇండో పసిఫిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం దేశంలో రెండో కేంద్రంగా నిలిచిందని చెప్పారు. ఒయు ఇప్పుడిప్పుడే తిరిగి పునర్వైభవం దిశగా అడుగులు వేస్తోందన్న ఆయన నూతన అధ్యయన కేంద్రాలు ప్రపంచ గుర్తింపు తెస్తాయనడంలో సందేహం లేదన్నారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఒఎస్‌డి, అంబాసిడర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఇండో పసిఫిక్ కేంద్రం ప్రారంభించే చారిత్రక కార్యక్రమానికి హాజరు కావటం ఆనందంగా ఉందని అన్నారు. దేశ అభివృద్ధిలో విదేశీ వ్యవహారాలు ఎంతో ముఖ్యమని చెప్పారు. మూడు శతాబ్ధాలుగా యూరప్, అమెరికా దేశాల పరిణామక్రమాన్ని వివరించిన ఆయన అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ పసిఫిక్ మహా సముద్రం తీర ప్రాంత దేశాలేనని తెలిపారు. అందుకే ఇండో పసిఫిక్ అధ్యయన కేంద్రానికి ప్రాముఖ్యత ఉందని వెల్లడించారు. యుద్ధాలు సమస్యలు పరిష్కరించలేవనే విషయాన్ని సమకాలీన పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చని, వైరుధ్యాలను వదిలి సత్సంబంధాల దిశగా అభివృద్ధి పంథాను ఎంచుకోవాలని అన్నారు. ఉస్మానియా ప్రారంభించిన ఇండో పసిఫిక్ అధ్యయన కేంద్రానికి కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ అవసరమైన తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. నాణ్యమైన పరిశోధనల ద్వారా ఒయుని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

ఒయు విసి ప్రొ.రవీందర్ మాట్లాడుతూ మాజీ ప్రధాని పివి నరసింహ్మారావు లుక్ ఈస్ట్ పాలసీ ద్వారా భారత్‌కు ఎంతో మేలు కలిగిందని, ప్రస్తుతం భారత్ అభివృద్ధి దిశగా సాగటానికి ఆయన తీసుకున్న విధాన నిర్ణయాలే కారణమని అన్నారు. గతంలో ఒయులో ఓషియన్ స్టడీస్ కేంద్రం ఉండేదని, నిధుల నిలుపుదల కారణంగా అది మూతపడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇండో పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభించటం ద్వారా తిరిగి ఉస్మానియా తన వైభవాన్ని నిలబెట్టుకుంటుందని చెప్పారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మార్పు, విదేశాంగ విధానం, భద్రత, పర్యావరణ, వాతావరణ మార్పులు సహా వివిధ అంశాలపై అన్వేషణలో భాగంగా ఆయా రంగాలకు చెందిన నిష్ణాతులు, నిపుణులు, విధానకర్తలు, విద్యార్థులు, పరిశోధకులను ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని వివరించారు.

శాసనమండలి సభ్యులు సురభి వాణీదేవి మాట్లాడుతూ.. నాటి ప్రధాని పీవి నరసింహ్మారావు ఆసియా- పసిఫిక్ దేశాల సంబంధాలను బలోపేతం చేయటానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. దేశాల మధ్య సత్సంబంధాల ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ ఆర్ లింబాద్రి మాట్లాడుతూ ఉస్మానియాలో ప్రారంభించిన ఇండో పసిఫిక్ కేంద్రానికి మంచి భవిష్యత్తు ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, ఇండో పసిఫిక్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ జె.ఎల్.ఎన్ రావు, ప్రజాసంబంధాల అధికారి ప్రొఫెసర్ ప్యాట్రిక్ ప్రిన్సిపల్స్, ఆయా విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

డబ్బు తీసుకున్నట్టు నిరూపిస్తావా?

ఈటలకు రేవంత్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బిఆర్‌ఎస్ నుంచి రేవంత్‌రెడ్డి రూ. 25 కోట్లు తాను తీసుకున్నట్టు బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలను పిసిసి అధ్యక్షులు రేవంత్ తిప్పికొట్టారు. బిఆర్‌ఎస్ నుంచిగానీ, కెసిఆర్ నుంచిగానీ డబ్బు తీసుకున్నట్టు నిరుపిస్తావా? అని సవాల్ విసిరారు. ఈటల రాజేందర్ రాజకీయంగా దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రేవంత్ విలేకర్లతో శుక్రవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఒక్క రూపాయి కూడా బిఆర్‌ఎస్ నుంచి గానీ, కెసిఆర్ నుంచి గానీ సాయం పొందలేదని స్పష్టం చేశారు. మునుగోడు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన ప్రతీ రూపాయి తమ కార్యకర్తలు ఇచ్చిన చందాలని అన్నారు. కాంగ్రెస్‌లోని బలహీన వర్గాల నాయకులే మునుగోడు ఎన్నికలకు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. వారి శ్రమను, ఆర్థిక సాయాన్ని అవమానించేలా ఈటల మాట్లాడటం సమంజసం కాదన్నారు. బిజెపి నేతలు భాగ్యలక్ష్మి అమ్మవారిని నమ్ముతారనీ, శనివారం సాయంత్రం ఆరు గంటలకు వాళ్లు నమ్మే భాగ్యలక్ష్మి టెంపుల్‌లో దేవుడిపై ఇదే విషయాన్ని ఒట్టేసి చెబుతానని సవాల్ చేశారు. తనపై చేసిన ఆరోపణలను ఈటల నిరూపించేందుకు సిద్ధమా? అని ఈటలను ప్రశ్నించారు. 'భాగ్యలక్ష్మి దేవుడిపై నమ్మకం లేకుంటే.. ఏ ఆలయంలో నైనా తడి బట్టలతో ప్రమాణానికి తాను సిద్ధం' అని రేవంత్ రెడ్డి ఈటెల రాజేందర్‌కు సవాల్ విసిరారు. బిజెపిలో చేరిన తర్వాత వ్యక్తిత్వం కోల్పోయి మాట్లాడుతున్నారని పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి ఒక ప్రకటనలో విమర్శించారు. ఆ పార్టీలో ఆయనకు విలువ లేకుండా పోవడంతో మతిస్థితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటలకు ధైర్యం ఉంటే కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలను నిరూపించాలని కోరారు. లేకపోతే తాను తప్పుడు ఆరోపణలు చేశానంటూ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

డ్రైవర్ సాధికారత పథకం గొప్ప వరం

మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డ్రైవర్ సాధికారత పథకం గొప్ప వరం లాంటిదని ఎస్‌సి అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 78 మంది లబ్ధి దారులకు ఆయన కార్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ యువతకు అండగా నిలిచేలా ప్రభుత్వం డ్రైవర్ సాధికారత పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు.కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ క్రిస్టియన్లకు 60 శాతం సబ్సిడీతో కార్లను అందజేస్తున్నట్టు వివరించారు. లబ్ది దారులు వాటిని ట్రావెల్స్‌గా, క్యాబ్ మాదిరిగా నడుపుకొంటారని తెలిపారు. ఇప్పటి వరకు 1831 లబ్దిదారులకు ఆర్థిక సబ్సిడీ కింద రూ.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. డ్రైవర్ సాధికారత పథకం కింద 2016-17, 2018-19 సంవత్సరాల్లో కార్లు కొనుగోలు కోసం 154 మంది క్రైస్తవ మైనారిటీ లబ్దిదారులకు రూ. 6.90 కోట్లు విడుదల చేసినట్టు వివరించారు. తాజాగా క్రిస్టియన్ ఫైనాన్ కార్పొరేషన్ ద్వారా 78 మంది లబ్దిదారులకు డ్రైవర్ సాధికారత పథకం క్రింద కార్లను అంద చేసినట్టు చెప్పారు.

5 నుంచి నిరవధిక సమ్మె

ట్రాన్స్‌కో, జన్‌కో చైర్మన్‌కు టిఎస్‌యుఇఇయు సమ్మె నోటీస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్, ఆన్‌మెన్డ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యల సాధన కోసం మే 5 నుంచి నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌యుఇఇయు) తెలిపింది. శుక్రవారం ఈ మేరకు ట్రాన్స్‌కో, జన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, టిఎస్‌ఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, టిఎస్‌ఎన్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె ఈశ్వర్‌రావు, జె ప్రసాద్‌రాజు సమ్మెనోటీస్ అందజేశారు.

తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కమ్‌ల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలని వారు ఈ సందర్భంగా ఉన్నతాధికారులను కోరారు. ఇదే అంశంపై యాజమాన్యాల్ని అనేక సార్లు కోరామనీ, వినతిపత్రాలు సమర్పించామని గుర్తు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15న జరిగిన వేతన ఒప్పందం సందర్భంగా వారిని కన్వర్షన్‌తోపాటు ఎపిఎస్‌ఇబి రూల్స్ అమల్లోకి తెస్తారని ఎదురు చూసిన తమకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్స్, ఓ అండ్ ఎమ్ ఉద్యోగులు చేస్తున్న పనులనే ఆన్‌మెన్డ్ కార్మికులు చేస్తున్నారని తెలిపారు. వారికి సంస్థలో గుర్తింపే లేదని పేర్కొన్నారు. ఈ కార్మికులు ప్రాణాలను ఫణంగా పెట్టి సంస్థకు సేవలు చేస్తున్నారని, ఈ ఆన్‌మెన్డ్ కార్మికులందరిని ఆర్టిజన్స్‌గా గుర్తించి వారికి వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

సంస్థను నమ్ముకుని 6500 మంది పీస్‌రేట్ కార్మికులు, రెవెన్యూ, క్యాషీయర్, స్పాట్ బిల్డర్స్‌తోపాటు ఇతర కార్మికులకు చాలా తక్కువ కమిషన్ వస్తుందనీ, ఆ కార్మికులకు కనీస వేతనాల జిఒ నెంబర్ 11ను అమలు చేయాలని కోరారు. ట్రాన్స్, జెన్‌కో రెండు డిస్కంల్లో ఉన్న ఆర్టిజన్స్, పీస్‌రేట్ కార్మికులు, ఆన్‌మెన్డ్ కార్మికులతోపాటు ఈ నెల 15న జరిగిన వేతన ఒప్పందంలో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పారిశ్రామిక వివాదాలచట్టం 1947 సెక్షన్-22, సబ్‌సెక్షన్ (1) ప్రకారం ఇక తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయమైన కోర్కెల సాధన కోసం మే5 నుంచిగాని ఆ తర్వాతగాని ఏ సమయంలోనైనా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు సమ్మెనోటీసులో పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

డిమాండ్లు

- ఆర్టిజన్స్‌ను రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ చేయాలి. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలి. ఈ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా 'పేస్కేల్' ఇవ్వాలి. అన్ని రకాల సెలవులు వర్తింప జేయాలి. కాంట్రాక్ట్ సర్వీస్‌ను కలిపి గ్రాడ్యూటీ, సర్వీస్ వెయిటేజ్ ఇంక్రిమెంటు ఇవ్వాలి.
- ఆర్టిజన్స్ పిఎఫ్‌పై సీలింగ్ తొలగించి బేసిక్ డిఎ మొత్తానికి పిఎఫ్ షేర్ చెల్లించాలి. కార్మికులకు పాతపద్ధతి ప్రకారమే ఇంటి అద్దె అలవెన్స్ చెల్లించాలి.
- ఆర్టిజన్స్ కారుణ్య నియామకాల్లో అర్హతను బట్టి తగిన గ్రేడ్ ఉద్యోగం ఇవ్వాలి. మెడికల్‌గా అన్‌ఫిట్ ఉన్న కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- ఆన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలి. స్కిల్డ్ వేతనం అమలు చేయాలి.
- పీస్‌రేట్ కార్మికులకు బిల్‌కలెక్టర్, స్పాట్‌బిల్డర్, ఏసీపీఎం, పీఎపి స్టోర్ తదితర కార్మికులకు జిఒ నెం 11 ప్రకారం కనీసవేతనాలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- 4.12.2016 వరకు సర్వీస్‌లో ఉండి అన్ని అర్హతలువున్న కాంట్రాక్టు/ ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలి.
- 2011 జూనియర్ లైన్‌మెన్లకు నియామక తేదీ నుంచి వేతన బకాయిలు చెల్లించాలి.
- కారుణ్య నియామకాలు పాత పద్ధతి ప్రకారం ఇవ్వాలి.
- హాట్‌లైన్లలో పని చేసే ఆర్టిజన్ కార్మికుల విద్యార్హతతో సంబంధం లేకుండా గ్రేడ్-1 వేతనాలు చెల్లించాలి. (రిస్క్‌ను దృష్టిలో ఉంచుకుని)
- 33/11 కెవి సబ్ స్టేషన్లలో నాలుగో ఆపరేటర్‌ను పెట్టాలి.

టిఎస్‌పిఎస్‌సి అదనపు కార్యదర్శిగా సంతోష్

మరో పది కొత్త పోస్టులు మంజూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. కమిషన్‌లో పది కొత్త పోస్టులను తాజాగా మంజూరు చేసింది. పరీక్షల కంట్రోలర్, డిప్యూటీ కంట్రోలర్, అసిస్టెంట్ కంట్రోలర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్, సీనియర్, జూనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సీనియర్, జూనియర్ ప్రోగ్రామర్ పోస్టులు, జూనియర్ సివిల్ జడ్జి కేడర్‌లో లా ఆఫీసర్ పోస్టులకు కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ కొత్త పోస్టులను మంజూరు చేసింది. టిఎస్‌పిఎస్‌సి అదనపు కార్యదర్శిగా ఐఎఎస్ అధికారి బిఎం సంతోష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలను నుంచి ఆయనను బదిలీ చేసింది. సంతోష్ టిఎస్‌పిఎస్‌సి పరీక్షల కంట్రోలర్‌గా వ్యవహరించనున్నారు.

అడుగంటుతున్న 'భూగర్భ జలాలు'

- మెట్ట ప్రాంత బావుల్లో ఇంకిపోతున్న నీరు
- కరెంటు కష్టాలు తోడై ఎండిపోతున్న పంట పొలాలు
- చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్చి నెల నుంచే ఎండలు మండిపోతుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో బావుల్లో నీరు ఇంకిపోవడంతోపాటు కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయి. దాంతో వరి, మొక్కజొన్న, వేరుశనగ పంట పొలాలు ఎండుతున్నాయి. ప్రధానంగా కల్వకుర్తి, అచ్చంపేట లింగాల, బల్మూరు, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాల పరిధిలో ఈ సమస్య కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. భూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటిపోతుండటంతో సాగుచేసిన మెట్ట పంట చేతికి వస్తుందో రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జనవరి, ఫిబ్రవరితో పోల్చితే మార్చి చివరి నాటికి మీటరు లోతుకు నీరు పడిపోయింది. ప్రస్తుతం ఏప్రిల్ చివరి నాటికి అవి మరో మీటరు లోతుకు పడిపోయే అవకాశం ఉందని పలువురు అంచనా వేశారు.

మెట్టప్రాంతాల్లో పరిస్థితి అధ్వానం

కల్వకుర్తి మండలం పంజుగుల్ సిలార్‌పల్లి, ఎల్లికళ్ల తదితర గ్రామాల్లో రోజురోజుకు భూగర్భజలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. తాడూరు మండలం గుంతకోడూరు యాదరెడ్డి పల్లి, నెల్లికుదురు, లింగంపల్లి, ఏటిధర్పల్లి పల్లి, అంతారం, సాగునీటి పరిస్థితి తీవ్రంగా ఉంది. లింగాల మండలం అప్పాపూర్ తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. బావుల్లో నీరు అడుగంటి పోయాయి. కల్వకుర్తి మండలంలో పారుతున్న కెఎల్‌ఐ కాల్వలు ఎగువ ప్రాంతంలోని గ్రామాల్లో నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. మణుగరు మండలం కొండనాగుల రామచిపెల్లి, వీరమరాశి పల్లి, సాయిన్ పల్లి గ్రామాల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్, గండీడు, మండలాల పరిధిలోనూ నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. జిల్లాలో 2022 నవంబర్‌లో సగటున 4.50 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. డిసెంబరు నాటికి అవి 5.16 మీటర్లకు, ఈ సంవత్సరం జనవరి నాటికి 6.21 మీటర్లకు పడిపోయాయి. ఫిబ్రవరి 7.13 మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. మార్చి వరకు 8.5 మీటర్లకుపైగా లోతుకు వెళితేగాని భూగర్భజలాలు లభ్యమయ్యే అవకాశం కనిపించడంలేదు. ప్రతి నెల సగటున మీటరు నుంచి రెండు మీటర్ల లోతు వరకు నీరు పడిపోతూ వస్తున్నది. గతేడాది ఫిబ్రవరిలో 5.96 మీటర్ల లోతున నీరు లభ్యంకాగా, ఈ ఏడాది భూగర్భ జలాలు 7.13 మీటర్లకు పడిపోయాయి. గట్టు మండలంలో భూగర్భజలాలు 23.53 మీటర్లకు, ఐజ మండలంలో 12.80, మల్దకల్ మండలంలో 10.44, బిజినపల్లి 10.25, కోస్గి 9.85, ఉట్కూరు మండలంలో 8.31, మక్తల్ మండలంలో 7.40, నర్వలో 7.17 మీటర్లకు పడిపోయాయి. మిగతా మండలాల్లో 3.50 మీటర్ల నుంచి ఆరు మీటర్ల లోతున భూగర్భ జలాలు లభిస్తున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయి తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి.

ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న రిజర్వాయర్ల చివరి ఆయకట్టు భూములు సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా వనపర్తి జిల్లాకు సాగునీరు జూరాల నుంచి అందడంతోనే పంట పొలాలు సాగవుతున్నాయి. వారబంది ఉండటం వల్ల ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. కాలువలకు నీరు పూర్తిగా నిలిచిపోవడంతో చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులపాలవుతున్నారు. కల్వకుర్తి కోయిల్ సాగర్, నెట్టెంపాడు, బీమా వంటి రిజర్వాయర్ పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒకవైపు రిజర్వాయర్లలో నీరు లేకపోవడం, మరోవైపు కాలువలకు ఆగిపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతుంటే.. భూగర్భ జలాలు పడిపోవడం ఉమ్మడి జిల్లా రైతులను మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

కళాసంపద పరిరక్షణకు సారిపల్లి సహకారం

ప్రజాశక్తి - కల్చరల్

ఆర్థికంగా అవస్థలు పడుతున్న జానపద కళాకారులను నిండు మనస్సుతో ధన సహాయం చేసి ఆ కళా సంపద పరిరక్షణకు సారిపల్లి కొండల రావు విశేష సహకారం చేస్తున్నారని ప్రముఖులు ప్రశంసించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో యువకళావాహిణి, జానపద కళాకారుల సంఘం నిర్వహణలో తెలంగాణా జానపద కళాకారులకు నగదు పురాస్కర ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ పాల్గొని మాట్లాడుతూ ఐదేళ్ల గా నిరంతరం ప్రతి నెలా రెండు తెలుగు రాష్ట్రాలలో జాన పద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్న కొండలరావు ధనర్జనే ప్రధానం కాదని సహానుభూతి ఇతరుల పట్ల వుండాలని ఆదర్శంగా నిలిచారని అన్నారు. శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ధనం కూడబెట్టటం జీవిత పరమార్ధంకాదని కష్టాలు పడుతున్న జాన పద కళాకారుల కన్నీరు తుడవటమే సార్ధకత అని నమ్మిన కొండలరావు ఇతరులకు మార్గదర్శి అని కొనియాడారు. సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ జాన పద కళాకారులే రామాయణ మహా భారత పురాణాలు సామాన్య గ్రామీణ ప్రజల్లో వ్యాప్తికి సారధులని అట్టి వారికి తన వంతు సహాయం అందిస్తున్న కొండల రావు అభినందనీయులని అన్నారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు ప్రతీ నెలా వంద మంది జాన పద కళాకారులకు ఒకొక్కరికి వేయి చొప్పున అందిస్తున్నానని తెలిపారు. డాక్టర్ మామిడి హరికృష్ణ తమ ప్రసంగంలో దేశపతి శ్రీనివాస్ ప్రతిభను కొనియాడారు. శాసన మండలి సభ్యుడుగా ప్రమాణ స్వీకారం చేసిన దేశపతి శ్రీనివాస్‌ను సత్కరించారు. అనంతరం వివిధ జాన పద కళాకారులకు నగదు బహుకరణ జరిగింది. లంక లక్ష్మీనారాయణ కార్యక్రమం పర్యవేక్షణ చేశారు.

టి-సేవ్ దీక్షకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టి-సేవ్ నిరాహార దీక్షకు తెలంగాణ హైకోర్టు శుక్రవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందిరాపార్కు వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టే నిరాహార దీక్షకు షరతులతో కూడిన అనుమతిచ్చింది. నిరాహార దీక్షకు 500 మంది కంటే ఎక్కువ పాల్గొనవద్దని.. దీక్షకు 48 గంటల ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించింది. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని పార్టీల ఆధ్వర్యంలో ఈ దీక్ష సాగనుంది. నిరుద్యోగ యువతకు మద్దతుగా నిర్వహించదలచిన అఖిలపక్ష నిరాహార దీక్షకు అనుమతి మంజూరు చేసేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలంటూ వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు షర్మిల ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 17న నిర్వహించదలచిన నిరాహార దీక్షకు అనుమతిని నిరాకరిస్తూ పోలీసులు జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ షర్మిల పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ప్రశ్నపత్రాల లీకేజీల నేపథ్యంలో.. నిరుద్యోగ యువతకు మద్దతుగా ఇందిరాపార్కు వద్ద అఖిలపక్ష నిరాహార దీక్షకు అనుమతిని కోరుతూ పోలీసులకు వినతిపత్రం సమర్పించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసింది.

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు : మంత్రి గంగుల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలతో రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చురుగ్గా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వరకూ 1,131 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. రైతు పండించిన చివరిగింజను సైతం మద్దతు ధరతో కొంటామని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రూ.186 కోట్లు విలువ చేసే 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. అత్యధికంగా నల్గొండ, నిజామాబాద్‌లో కొనుగోలు చేశామన్నారు. లక్ష్యం మేరకు సేకరణకు అవసరమైన 7,031 పైచిలుకు కొనుగోలు కేంద్రాలు, గన్నీ బ్యాగులు, వెయింగ్ మిషన్లు, హమాలీలను సమకూర్చుకున్నామని తెలిపారు.

వైద్య బీమాపై అవగాహన పెరగాలి : గవర్నర్

హైదరాబాద్ : వైద్య బీమాపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ ఏర్పాటు చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ విజన్ 2030లో గవర్నర్ మాట్లాడుతూ.. విద్యా వంతుల్లోనూ ఇప్పటికీ వైద్య బీమాపై అవగాహన కొరవడిందన్నారు. 2030 నాటికి అందరికీ ఇది అందుబాటులోకి రావాలని ఆకాక్షించారు. రోగం వచ్చినప్పుడు వైద్య బీమా ఉంటే ఆర్థిక రక్షణ పొందవచ్చన్నారు. ఎఫ్‌టిసిసిఐ దీనిపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని గవర్నర్ సూచించారు. మెరుగైన వైద్యం పొందడం కూడా ఒక హక్కు అని పేర్కొన్నారు. బీమా అమలు సమయంలో ఏవైనా చిన్న పొరపాట్లు ఉన్నప్పటికీ రోగులకు సాయం అందించాలని సూచించారు.

'మెడికవర్'లో ఇ-కన్సల్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికవర్ హాస్పిటల్స్ ఇ-కన్సల్ట్ సేవలను హాస్పిటల్స్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ సర్వీస్ డెలివరీని డిజిటలైజ్ చేయడం ద్వారా సూపర్ స్పెషాలిటీ సేవలడెలివరీలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ రెడ్డి మాట్లాడుతూ, ఇళ్లలో లేదా ఎక్కడి నుండైనా ఇ-ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మెరుగైన చికిత్సను పొందవచ్చన్నారు. మెరుగైన సేవలను అందించటానికి మెడికవర్ హాస్పిటల్స్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ బిజినెస్ మహేష్ దెగ్లూర్కర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ కైలాసం, డాక్టర్ శ్రీనివాస్ జూలూరి, డాక్టర్ కమల్ కిరణ్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కృష్ణ కిరణ్, డాక్టర్ ప్రతాప్ వర్మ, సెంటర్ హెడ్ మాత ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లారీ-మినీ బస్సు ఢీ

- బస్సు డ్రైవర్ మృతి
- 12 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈదురు గాలులకు చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడటంతో లారీ, మినీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతిచెందారు. 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల పరిధిలోని కొత్తపేట వద్ద రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అస్తికలను గోదావరిలో కలిపేందుకు మెదక్ జిల్లా గజ్వేల్ మండలం బెజ్గాంకు చెందిన కుటుంబీకులు 30 మంది మినీ బస్సు ప్రయివేట్ ట్రావెల్స్‌లో ధర్మపుకి వస్తున్నారు. గురువారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. ఆ కొమ్మను తప్పించబోయి బస్సు డ్రైవర్ కుడివైపు తిప్పడంతో అటు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులలోని 12 మందికి తీవ్ర గాయలయ్యాయి. ఎస్ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకొని వారిని బస్సులోంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ మృతిచెందాడు. ఉదయం ఆర్‌అండ్‌బి అధికారులు చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు.